యువతిని మోసగించిన ఒకరికి జైలు శిక్ష

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): యువతిని పెళ్లి చేసుకుంటానని లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ మంగళవారం తీర్పు చెప్పారు. రెబ్బెన సీఐ బుద్దే స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. రెబ్బెన మండలం ఖైరిగూడ గ్రామానికి చెందిన యువతి తన భర్తతో విడాకులు తీసుకుంది. కూలి పనులు చేసుకుంటూ తల్లి ఇంట్లో ఉంటున్నది. ఈ క్రమంలో బాధితురాలి అన్నకు స్నేహితుడైన దుగ్గపూర్‌కు చెందిన జక్కుల శివకుమార్ తరచూ వారి ఇంటికి వచ్చేవాడు. యువతి ని ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబ సభ్యులు పెళ్లి చేసుకోవాలని శివకుమార్ ఇంటికి వెళ్లి అడుగగా నిరాకరించాడు. దీంతో సదరు బాధితురాలు రెబ్బెన పోలీసు స్టేషన్‌లో 17.09.2020న ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. పీపీ జగన్మోహన్‌రావు సీడీఓ అండ్ లైజనింగ్ ఆఫీసర్ రాంసింగ్ సాక్షులను హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో నిందితుడు శివప్రసా ద్‌కు 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా విధించారు. ఈ కేసులో ఏ-2గా ఉన్న నిందితుడి తల్లి, ఏ-3గా ఉన్న తండ్రి), ఏ-4గా ఉన్న సోదరిలకు ఒకొక్కరికి రూ.5, 200 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. కేసులో నింది తులకు శిక్ష పడేలా కృషి చేసిన ప్రస్తుత ఏఎస్పీ చిత్తరంజన్, సీఐ బుద్దే స్వామి, ఎస్సై చంద్రశేఖర్‌లను ఈ సందర్భంగా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అభినందించారు.



మహిళా సంఘాలకు ఎన్నికలు

- గ్రామీణాభివృద్ధిశాఖ అధికారుల కసరత్తు
- ఇటీవల ఏపీఎం, సీసీలకు శిక్షణ
- మార్చిలోపు ప్రక్రియ పూర్తయ్యేలా ప్రణాళిక
- జిల్లాలో 92,512 మంది సభ్యులు

"స్వయం సహాయక(మహిళా) సంఘాలకు కొత్త సారథుల ఎంపికకు కసరత్తు మొదలైంది. సంఘం సభ్యుల నుంచి గ్రామ, జిల్లా సమాఖ్యలకు అధ్యక్ష, ఉపాధ్యక్షురాళ్లను ఎన్నుకునే ప్రక్రియ చేపట్టనున్నారు. ఇందు కోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు."

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలకు కొత్త సారథులను ఎన్నుకోవడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. సం ఘం సభ్యుల నుంచి గ్రామ, మండల, జిల్లా సమాఖ్యలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకునే ప్రక్రియను జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు చేపట్టనున్నారు. ఎన్నికల నిర్వహణపై ఇప్పటికే మండల ఏపీఎం, సీసీలు, ఇతర సిబ్బందికి జిల్లా స్థాయిలో శిక్షణ ఇచ్చారు. వీరు గ్రామ స్థాయిలో కొత్త సారథుల ఎన్నికపై సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. మార్చి నెలాఖరులోపు ప్రక్రియ పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు.

ఆర్థిక పురోగతి..

స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేయడం, శ్రీనిధి రుణాలు ఇవ్వడంతో మహిళలు ఆర్థిక పురోగతి సాధిస్తున్నారు. మహిళలు ఒక వైపు కుటుంబ బాధ్యతలు నిర్వరిస్తూనే మరో వైపు చిరు వ్యాపారాల్లో రాణిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. ప్రతినెలా క్రమం తప్పకుండా పొదుపు డబ్బులతో పాటు శ్రీనిధి రుణాల డబ్బులు కూడా బ్యాంకులలో వీరు జమ చేస్తున్నారు. ఈ ప్రక్రియలో మహిళా సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షుల పాత్ర కీలకమైంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న మహిళా గ్రామ సంఘాలు వేల కోట్ల రూపాయల లావాదేవీలు కొనసాగిస్తున్నాయి.

కొత్త వారికి అవకాశం

స్వయం సహాయక సంఘాల్లో కనీసం 10 మంది నుంచి 15 మంది వరకు సభ్యులుంటారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సంఘాల్లోని సభ్యుల్లో కొత్త వారికి అవకాశం కల్పించనున్నారు. నిబంధనల ప్రకారం ఆసక్తి ఉన్న మహిళలకు సమావేశం నిర్వహిస్తారు. ఈ మేరకు ఏకగ్రీవం, చేతులు పైకెత్తి ఎన్నుకోవడం, చీటీలు రాసి సభ్యురాలి ఎన్నికకు మద్దతు తెలియజేయడంలాంటి మూడు పద్ధతుల్లో ఏదైనా విధానం ద్వారా ఎన్నుకో వాల్సి ఉంటుంది. సంఘాల ద్వారా ఎన్నికైన అధ్యక్షులు గ్రామ సంఘం అధ్యక్షురాలిని, గ్రామ సమాఖ్య అధ్యక్షుల నుంచి మండల సమాఖ్య అధ్యక్షురాలిని ఎన్నుకుంటారు. మండల సమాఖ్య అధ్యక్షురాళ్లు అందరు కలిసి జిల్లా సమాఖ్యకు అధ్యక్షులను ఎన్నుకుంటారు. మండల స్థాయి ఎన్నికల ప్రక్రియను ఫిబ్రవరి నెలాఖరు వరకు పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మార్చి నెలలో జిల్లా సమాఖ్య ఎన్నికలు పూర్తి చేయ నున్నట్లు అధికారులు చెబుతున్నారు.

15 మండలాల పరిధిలో..

జిల్లాలోని 15 మండలాల పరిధిలోని 398 గ్రామాల్లో 8,138 సంఘాలు ఉన్నాయి. ఇందులో 92,512 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో ఎస్సీ 15,758, ఎస్టీ 30,928 మంది, బీసీ 38,762 మంది, మైనార్టీ 2519 మంది, ఓసీ 4,019 మంది, ఇతరులు 526 మంది సభ్యులున్నారు.

మార్చిలోగా ప్రక్రియ పూర్తి..

దత్తారాం, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి



మహిళా సంఘాల ఎన్నికల ప్రక్రియను మార్చిలోగా పూర్తి చేస్తాం. ఇది వరకే ఏపీఎం, సీసీలకు ఒకరోజు శిక్షణ ఇచ్చాం. జిల్లాలో 8,138 సంఘాలు ఉన్నాయి.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మాజీ జడ్పీటీసీ, ఎంపీపీ అరిగెల నాగేశ్వర్‌రావు, మల్లికార్జున్ యాదవ్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఎంపీపీ కప్ పోటీలను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకు ముందు ఎమ్మెల్యే క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పిల్లలు క్రీడల్లో రాణించి ఉన్నత స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. సొంతగా క్రీడలు నిర్వహించడం అరిగెల సోదరులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబీన్ అహ్మద్, నాయకులు శ్రీనివాస్, పరీక్షల నిర్వహణాధికారి ఉదయ్‌బాబు, ఎంఈఓ శుభాష్, జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, టాస్మా సభ్యులు రాధాకృష్ణచారి, నాయకులు ప్రహ్లాద్, శ్రీనివాస్, ప్రసాద్‌గౌడ్, ముషీర్, బలరాం, మల్లేష్, పెంటయ్య, నిసార్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సుభాష్, హేమంత్, సదాశివ్, ఊశన్న, సురేష్, శంకర్, తుకారాం, తదితరులు పాల్గొన్నారు.

పుష్యమాసం ఆదివాసీలకు పవిత్రం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్

కెరమెరి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పుష్యమాసం ఆదివాసీలకు అత్యంత పవిత్రమైనదని నెలరోజుల పాటు భక్తిశ్రద్ధలతో పెర్సాపెన్‌లను పూజిస్తారని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. కెరమెరి మండలం పెద్దకరంజీవాడ గ్రామంలో పుష్య అమావాస్య సందర్భంగా మంగళవారం ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి నాగోబా ఆలయంలో పూజలు నిర్వహించారు. ముందుగా గ్రామస్థులు ఎమ్మెల్యేకు సంప్రదాయ డోలు వాయిద్యాల మధ్య ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలు ఆచార వ్యవహారాలు ఇతరుల కంటే భిన్నంగా ఉంటాయని చెప్పారు. ప్రకృతినే దైవంగా బావించి పూజలు చేయడం తరతరా లుగా వస్తున్న ఆచారమని అన్నారు. నేటి యువత సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశ్వనాథ్‌రావు, దేవురావు, శుకు, భీంరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

కాగజ్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సంఘం డైరీ, క్యాలెండర్లను మంగళవారం ఎంఈవో ప్రభాకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లతీఫ్, నాయకులు చంద్రశేఖర్, సిర్పూరు ఎంఈఓ డి.వేణుగోపాలరావు, తాటిరవీందర్, వెంకటరాజయ్య, తన్నీరు మురళి పాల్గొన్నారు.

గీత పారిశ్రామిక సంఘం మండల కార్యవర్గం

రెబ్బెన, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గీత పారిశ్రామిక సహకార సంఘం మండల కార్యవర్గాన్ని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాళ్లపెల్లి కిష్టగౌడ్, ఉపాధ్యక్షుడిగా గడ్డం రమేష్, కార్యదర్శిగా మడ్డికృష్ణగౌడ్, డైరెక్టర్‌గా శంకర్ గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా నవీన్‌కుమార్ వ్యవహరించారు. ఎన్నికైన వారిని జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, శ్రీ రేణుక ఎల్లమ్మ గుడి చైర్మన్ అన్నపూర్ణ మురళీ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మోడెం చిరంజీవి గౌడ్, తదితరులు సన్మానించారు

ఈఎస్ఐ ఆసుపత్రి సిబ్బంది నిరసన

కాగజ్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఈఎస్ఐ ఆసుపత్రిని సొసైటీగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో మంగళవారం ఈఎస్ఐ ఆసుపత్రి సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది మాట్లాడుతూ సొసైటీ ఏర్పాటును తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఈఎస్ఐ ఆసుపత్రిగానే ఉండాలని డిమాండ్ చేశారు.

పప్పు దినుసుల సాగుపై అవగాహన

దహెగాం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా పప్పు దినుసుల సాగుపై శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. పప్పు దినుసుల సాగులో వేసవిలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓలు ఆనంద్‌రావు, వంశీ, దీపక్, లావణ్య, సుస్మిత తదితరులు పాల్గొన్నారు

రోడ్డు ఆక్రమణదారులకు నోటీసులు

కౌటాల, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కౌటాల మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య తీర్చేందుకు ఎంపీడీవో ప్రసాద్, కార్యదర్శి సాయికృష్ణ రోడ్డుకు ఇరువైపులా ఫుట్ పాతులను ఆక్రమించుకున్న వారికి నోటీసులు అందజేశారు. 24 గంటల్లో అక్రమాలు తొలగించాలన్నారు. రోడ్డుపై ఎత్తుగా మట్టిపోయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో ట్రాక్టర్‌తో చదును చేయించారు. వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతామని తెలిపారు.

నిరుపేద విద్యార్థులకు హాస్టల్ వసతి

జైనూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): నిరుపేద విద్యార్థులు ఉట్నూరు ప్రభుత్వ డిగ్రీ కళశాలలో రానున్న విద్యా సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ఉచిత అడ్మిషన్ పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ సాయి ప్రసాద్, స్వామీ కోరారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ, రాసిమెట్ట రెసిడెన్షియల్ కాలేజీలలో మంగళవారం వారు విద్యార్థులకు అవగాహన కల్పించారుమాట్లాడుతూ విద్యార్థులకు డిజిటల్ బోధన అందిస్తున్నామని అన్నారు. సద్వినియోగం చేసుకోవాలని చెప్పా రు. కళాశాలలో విద్యార్థిని, విద్యార్థులకు వేర్వేరు హాస్టల్ వసతి ఉంటుం దన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు జావీద్, ప్రవీణ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ముగిసిన దీక్షలు

లింగాపూర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో నెల రోజులుగా చేపడుతున్న జైజంగో జై లింగో దీక్షలు మంగళవారం ముగిశాయి. ఆదివాసీలు ప్రత్యేక పూజలు చేశారు. యేటా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తామని ఆదివాసీలు తెలిపారు.

ఎంపీడీవోగా సుధాకర్‌రెడ్డి

చింతలమానేపల్లి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): చింతలమానేపల్లి మండల నూతన ఎంపీఈవోగా మంగళవారం సుధాకర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి మండలాభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ బద్రుల్లాహక్, కార్యదర్శులు ఆసీఫ్ అలీ, హరిప్రసాద్, చందు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం అందజేత



అల్పాహారం పెడుతున్న సభ్యులు

వాంకిడి, జనవరి 28(ఆంధ్రజ్యోతి):వాంకిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగ తి విద్యార్థులకు మంగళ వారం కొండా లక్ష్మణ్ బాపూజీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అల్పా హారం అందజేశా రు. ఈ సందర్భంగా సభ్యు డు అవినాష్ మా ట్లాడుతూ ప్రతి రోజూ విద్యార్థులకు అలాహారం అం దజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యా ‘యుడు నటరాజ్, శ్రీనివాస్, వెంకట్రావు, నాగరాజు, కలీముద్దీన్ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

కాగజ్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా బంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజాలైఫ్ కేర్ ఆసుపత్రిలో మంగళవారం నిర్వహించిన కంటి వైద్యశిబిరానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా కాగజ్‌నగర్ పట్టణంతో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన 48 మందికి పరీక్షలు నిర్వహించారు. 36 మందికి కంటి ఆపరేషన్లు అవసరమున్నట్టు ప్రజా బంధుఫౌండేషన్ అధ్యక్షుడు హరీష్ బాబు తెలిపారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ కిమ్స్ ఆసుపత్రిలో మంగళవారం కొత్తపల్లి వెంకట లక్ష్మి చంద్రయ్య మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య స్పందన లభించినట్టు బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. 32 మందికి పరీక్షలు నిర్వహించామని, ఇందులో 17 మందికి శస్త్ర చికిత్స అసవరమున్నట్టు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. వీరికి ఉచితంగా ఆపరేషన్ చేయించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ శిబిరంలో అప్తామలాజిస్ట్ డాక్టర్ వెంకటేష్, శ్రీనాథ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

పెంచికలపేట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎస్సై కొమురయ్య ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు సరైన వాహన పత్రాలు కలిగి ఉండాలని చెప్పారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిడే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అక్రమ కట్టడాలపై చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో అనుమతి లేని కట్టడాలపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలో సరైన అనుమతులు లేకుండా భవనాలు నిర్మించడంపై అందిన ఫిర్యాదుల వివరాలు అందజేయాలన్నారు. బహుళ అంతస్తులు, వాణిజ్య పరమైన భవనాలు, అపార్టుమెంట్ల యజమానులు నిర్మణ పనులు ప్రారంభించడానికి ముందే అవసరమైన అనుమతులు పొంది ఉండాలన్నారు. సరైన అనుమతి పొందిన తరువాత మాత్రమే పనులు ప్రారంభించాలని సూచించారు. నిర్మాణ సమయంలో అన్ని ప్రభుత్వ నియమాలు, రక్షణ ప్రమాణాలు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. నోటీసులు జరీ చేసిన వాటికి సమాధానాలు ఇవ్వకుండా పనులు చేపట్టినట్లయితే జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో యజమానులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమతులు లేని వెంచర్లు, లే అవుట్ల విషయమై పూర్తి వివరాలతో నివేదిక రూపొందించాలన్నారు. అనుమతుల కోసం అందిన దరఖాస్తులను త్వరిగతిన పరిశీలించాలని సూచించారు. నిబంధనలకు లోబడి అనుమతులు జారీ చేయాలని తెలిపారు. లే అవుట్ల కమిటీ అధికారులు జిల్లా స్థాయిలో లే అవుట్ల నిబంధనల అమలుపై పర్యవేక్షించాలన్నారు. తనిఖీలు నిర్వహించి నివేదిక అందించాలని తెలిపారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరగా పూర్తి చేయాలన్నారు. తీసుకున్న చర్యలపై రోజు వారీగా నివేదికలు సమర్పించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీపీఓ భిక్షపతిగౌడ్, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, పట్టణ ప్రణాళికాధికారి యశ్వంత్, రోడ్లు భవనాల అధికారి సురేష్, పంచాయతీ రాజ్ ఈఈ ప్రభాకర్, పోలీసు, అగ్నిమాపక అధికారులు పాల్గొన్నారు.

రహదారి భద్రత ప్రతీ ఒక్కరి బాధ్యత

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత ప్రతీ ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలా వరణలో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారి రామచందర్ అధ్యక్షతన రహదారి భద్రత మహోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఏఎస్పీ ప్రభాకర్‌రావుతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారి భద్రత అనేది నిరంత ప్రక్రియ అని చెప్పారు. కానీ ప్రమాదాల నివారణకు ప్రజల సహకారం అవసరన్నారు. యువత వాహనాలను అత్యధిక వేగంతో రోడ్లపై నడపకూడదని సూచించారు. 18 ఏళ్ల లోపు వారు వాహనాలు నడపకూడదన్నారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోక పోతే ఒక్కో సారి పెద్ద ప్రమాదాన్ని తీసుకు వస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధలను పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా రోడ్డు నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఐఈవో కళ్యాణి, డీసీఆర్బీ డీఎస్పీ కరుణాకర్, జిల్లా గిరిజన సంక్షేమాధికారి రమాదేవి, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖాధికారి సజీవన్, సీఐ రవీందర్, ప్రిన్సిపాల్ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ షెడ్ నిర్మాణానికి భూమి పూజ

తిర్యాణి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): తిర్యాణి మండలం చింతలపల్లి జంగుబాయి గుడి, సుంగాపూర్ హనుమాన్ గుడి, గోపెర, బొజ్జుగూడ దండారి ఉత్సవాల ప్రాంగణాలకు డీఎంఎఫ్‌టీ నిదులతో మంగళవారం కాంగ్రెస్ నాయకులు అనీల్‌గౌడ్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి సీతక్క చొరవతో నిధులు మంజూరయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సాగర్, వెంకటేశంగౌడ్ శంకర్, విజయ్, బానయ్య, కొమురయ్య, అమర్, సాయికిరణ్, హరీష్‌కుమార్, రాజశేఖర్, రాహుల్, రంజిత్, వెంకటేష్, తెలంగరావు, వినోద్, బబ్లు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

బెజ్జూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ముంజంపల్లి గ్రామానికి చెందిన తొర్రెం గోసాయి సోమవారం అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మంగళవారం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరామర్శించారు. ఆయన వెంట బషరత్‌ఖాన్, వెంకన్న, సకారాం, సతీష్, రాజేష్, శంకరయ్య తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

సిర్పూర్(టి), జనవరి 28(ఆంధ్ర జ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. సిర్పూర్(టి) మండలంలోని చీలపల్లి, మెట్‌పల్లి, రావన్‌పల్లి, మాలిని గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. చీలపల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిదులతో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్ర భుత్వంతోనే అభివృద్ధి సాధ్యమన్నా రు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీల్లో ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని తెలిపారు. అనంతరం గ్రామంలోని మురికి కాలువలను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ గణపతి, నాయకులు సోహెల్ అహ్మద్, కిశోర్, రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వంలో అన్ని కులాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండలంలోరి సదాశివపేటలో రూ.5 లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్, గురుడుపేటలో రూ.5 లక్షలతో మాలి సంఘ భవన నిర్మాణానికి, తలోడిలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి మంగళవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను దశల వారీగా నెరవేరుస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండె విఠల్‌ను పలువురు సన్మానించారు. ఎమ్మెల్సీ సమక్షంలో తలోడి గ్రామానికి చెందిన పలువురు గ్రామస్థులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు విశ్వనాథ్, నానయ్య, గంగారాం, శ్రీవర్ధన్, మహేష్, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు

చింతలమానేపల్లి/బెజ్జూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): చింతలమానేపల్లి, బెజ్జూరు మండలాల్లో మంగళవారం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శు లు రహిమాన్, సంపత్‌కుమార్‌ల ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. టీయూడబ్ల్యూజే ఐజేయూ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే ఐజేయూ సభ్యులు ప్రకాష్‌గౌడ్, నవీన్‌గౌడ్, హరి, శంకర్, లక్ష్మణ్, మహేష్, శ్రీనివాస్, మోహన్, శ్రీనివాస్, దామోదర్, ప్రశాంత్; శ్రీధర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): మండలంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రహి మాన్, సంపత్‌కుమార్‌ల ఆధ్వర్యంలో సభ్య త్వ నమోదు చేపట్టారు. యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే ఐజేయూ సభ్యులు ప్రకాష్ గౌడ్, మారయ్య, అమూల్, నరేష్, నాగభూషన్, నాగరాజు, తిరుపతి, రాజు, విలాస్, రవి, వినోద్, ప్రేంసాగర్, మోరేశ్వర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాగోబా జాతర ప్రారంభం


నాగోబా ఆలయానికి వస్తున్న మెస్రం వంశీయులు


కోనేరు నుంచి నీటికి తీసుకువస్తున్న మెస్రం వంశీయులు, మహిళలు

ఇంద్రవెల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మెస్రం వంశీయుల మహాపూజలతో నాగోబా జాతర మంగళవారం రాత్రి వైభవంగా ప్రారంభమైంది. ఆదివాసీల ఆరాధ్య దైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ నాగోబా దేవతకు ఏటా పుష్యమాసం అమావాస్యను పురస్కరించుకుని ఆదివాసీలు జాతర నిర్వహిస్తారు. ఆదివాసీ గిరిజనులు ముఖ్యంగా మెస్రం వంశీయులు తమ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ నాగోబా సన్నిధిలో పవిత్ర గోదావరి జలాలతో నాగోబా దేవతను ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్రావు, మెస్రం వంశీయులు పూజారీ(కటోడ) మెస్రం దేవ్‌రావు, మెస్రం కోసురావు ఆధ్వర్యంలో ఆచార వ్యవహారాలతో పూజలు నిర్వహించారు. మంగళవారం మహాపూజతో ప్రారంభమైన నాగోబా జాతర వేడుకలు ఫిబ్రవరి 4 వరకు కొనసాగనున్నాయి. మంగళవారం అర్ధరాత్రి బేటింగ్ (కొత్త కోడళ్ల పరిచయం), భక్తుల దర్శనం, ప్రత్యేక పూజలు, 30న ఆదివాసీ దేవుళ్ల పెర్సాపేన్, బాన్‌పేన్‌లకు పూజలు చేయనున్నారు. 31న దర్బార్ నిర్వహించనున్నారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కానున్నారు. ఫిబ్రవరి 1న బేతాల్‌పూజ, మండగాజలింగ్ (ముగింపు కార్యక్రమం)తో జాతర ముగుస్తుంది. తెలుగు రాష్ట్రాలతో పాటు పక్కనే గల ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి వేలాది మంది ఆదివాసీ గిరిజనులు తరలివచ్చారు. గుడారాలు వేసుకొని మర్రిచెట్టు నీడన బస చేశారు. పవిత్ర గంగాజలంతో మూడు రోజులుగా మర్రిచెట్ల వద్ద బస చేసిన మెస్రం వంశీయులు మంగళవారం ఉదయం ఆదివాసీ గిరిజన సంప్రదాయ వాయిద్యాలతో కేస్లాపూర్‌లోని పురాతన (మురాడి) నాగోబా ఆలయానికి చేరుకొని సంప్రదాయ పూజలు చేశారు. పురాతన నాగోబా విగ్రహంతో పాటు వెలిగించిన దీపాలను వెదురుబుట్టలో పట్టుకొని శోభాయాత్రగా ఆలయానికి బయలు దేరారు. వీరికి మర్రిచెట్ల వద్ద బస చేస్తున్న మెస్రం వంశీయులు స్వాగతం పలికారు. వీరందరూ కలిసి ఆలయానికి చేరుకొని మైసమ్మ దేవతకు పూజలు చేశారు. అనంతరం పురాతన నాగోబా విగ్రహాలతో పాటు నాగోబా దేవత, సతీదేవత, భాన్‌దేవతలకు సంప్రదాయ పూజలు చేసి పురాతన విగ్రహాన్ని గర్భగుడిలోని నాగోబా విగ్రహం వద్ద ఉంచారు. ఆలయం వెనుకున్న భాన్‌దేవతలతో పాటు పెర్సపేన్‌కు పూజలు చేసి మళ్లీ ఆలయంలోకి ప్రవేశించారు. అనంతరం మహాపూజకు ఉపయోగించే ఆలయం వెనుక ఉన్న మట్టికుండలను మెస్రం వంశీయులు ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్రావు పటేల్ ఆధ్వర్యంలో మెస్రం వంశీయుల కటోడ మెస్రం దేవ్‌రావు, మెస్రం కోసు, కటోడ మెస్రం కోసేరావు, కటోడ హనుమంత్‌రావు పూజలు చేశారు.

కొత్త కుండలు అందజేత..

మెస్రం వంశీయుల పెద్దలు కొత్త కుండలను ఇవ్వగా మహిళలు వారి ఆశీర్వాదం తీసుకుని అందుకున్నారు. మెస్రం వంశీయుల అల్లుళ్లు, ఆడపడుచులు వరుసగా వెళ్లి పడమర మర్రిచెట్టు సమీపంలోని కోనేరు వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెస్రం వంశీయుల అల్లుళ్లు కోనేరులోని నీటిని తోడి మట్టికుండల్లో నింపారు. ఆ కుండలను మహిళలు తలపై పెట్టుకొని వరుసగా నాగోబా ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయం పక్కనే గల పాత మట్టి పుట్టల వద్ద అల్లుళ్లు మట్టిని తీసుకొని వచ్చారు. ఆడపడుచులు తెచ్చిన నీటితో పుట్టలను తయారు చేశారు.



ఆలయం గేటు వద్ద పాము


కుండలు అందుకుంటున్న మెస్రం వంశం కోడళ్లు

ఇంటర్వ్యూ....

అర్హులకు పట్టాలు అందజేస్తాం

● ఆడ జీర్వావ్, తహసీల్దార్



ఆంధ్రజ్యోతి: గిరిజన రైతులకు పట్టాలు మంజూరు చేసేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

తహసీల్దార్: మండలంలోని మారుమూల గ్రామాల్లో అర్హులైన గిరిజన రైతులకు పట్టాలు మంజూరుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్ణయం తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి:ఎస్సీలకు కుల ధ్రువీకరణ పత్రాల మంజూరులో జాప్యం జరుగుతోందని చెబుతున్నారు?

తహసీల్దార్: ఎస్సీ కమ్యూనిటీకి కుల ధ్రువీకరణ పత్రాల కోసం ఆర్డీవోకు ప్రతి పాదనలు పంపిస్తున్నాం. ఆర్డీవో సూచనల మేరకు అందజేస్తాం.

ఆంధ్రజ్యోతి: భూముల విరాసత్ కోసం వచ్చిన దరఖాస్తులపై తీసుకుంటున్న చర్యలు ఏంటి?

తహసీల్దార్: గిరిజన రైతులు భుముల విరాసత్ కోసం దరఖాస్తులు పెట్టుకుంటున్నారు. పరిశీలించి నిబం . దనల మేరకు చర్యలు తీసుకుంటున్నాం.

- జైనూరు, (ఆంధ్రజ్యోతి)

మున్సిపాలిటీలో 'ప్రత్యేక' పాలన

● అదనపు కలెక్టర్ దీపక్ తివారికి బాధ్యతలు
● సమస్యల పరిష్కారంపై ప్రజల ఆశలు



కాగజ్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభ మైంది. మున్సిపల్ పాలకవర్గం గడువు రెండు రోజుల క్రితం ముగిసింది. దీంతో సోమవారం నుంచి అధికారుల పాలన ప్రారంభమైంది. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో పాలకవర్గ మండలి గడువు ముగియడంతో ప్రభుత్వం జిల్లా అదనపు కలెక్టర్లకు బాధ్యత అప్పగించారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి అదనపు కలెక్టర్ దీపక్ తివారిని కేటాయించారు. సోమవారం పూర్తి బాధ్యతలు స్వీకరించారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో 30 వార్డుల్లో కీలక సమస్యలు పరిష్కరించేందుకు ఇక బాధ్యత అంతా కూడా అధికారులపైనే ఉంది. కాగజ్‌నగర్ 30 వార్డులకు 30 మంది వార్డు అధికారులను కేటాయించారు.

● **ప్రధాన సమస్యలు..**

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో కీలకమైన సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు.. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ఆర్థిక బలోపేతానికి అధికారులు కృషి చేయాల్సి ఉంది. ప్రస్తుతం మున్సిపాలిటీ ఆదాయం ఏడాదికి రూ.3 కోట్లు ఉంది. ఈ ఆదాయం కేవలం మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల వేతనాలకే సరిపోని పరిస్థితి నెలకొంది. ఒక వైపు ఆస్తి పన్ను వసూలు చేస్తున్నప్పటికీ కూడా మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు సంబంధించిన ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. సుమారు కోటి మేర బకాయిలు ఉన్నట్లు తేలింది. కాంట్రాక్టు కార్మికులకు నెల నెల జీతం ఇచ్చే పరిస్థితి లేదు. మున్సిపాలిటీ ప్రధాన రోడ్లు అంతా కూడా ఇష్టారాజ్యంగా ఉన్నాయి. మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని ఐదేళ్లుగా నిరీక్షిస్తున్నారు. ఈ ప్లాన్ అమలు చేస్తే మార్కెట్ రోడ్లు విస్తరణ జరిగే అవకాశాలున్నాయి. దీంతో ప్రజలకు ట్రాఫిక్ సమస్య తీరనుంది. అలాగే మెయిన్ మార్కెట్, అంబేద్కర్ చౌక్, రాజీవ్‌చౌక్, ఎన్టీఆర్‌చౌక్‌లో నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో మాస్టర్ ప్లాన్ అమలు చేసే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. వీటితో పాటు కాగజ్‌నగర్‌కు ఆనుకొని ఉన్న గ్రామాలను కూడా విలీనం చేస్తే పట్టణ అభివృద్ధి దిశగా అడుగులు పడనుంది. ఈ ప్రక్రియ పూర్తయితే మున్సిపాలిటీ గ్రేడ్-2గా మారేందుకు అవకాశాలున్నాయని చెబుతున్నారు. సమీకృత మార్కెట్ పనులు, స్విమ్మింగ్ పూల్ నిర్మాణం ఊసేలేకుండా పోయింది. వీటితో పాటు ఇకో ఫ్రెండీపార్కు నిర్మాణం ప్రతిపాదనకే పరిమితమైంది. పట్టణ ముఖ తోరణం నిర్మించాలన్న విషయం మరుగున పడిపోయింది. మహిళల కోసం స్త్రీ శక్తి భవనం నిర్మించాల్సి ఉంది. ఇక అంతర్గత రోడ్ల విస్తరణ, మురికి కాల్వల నిర్మాణం, లోతట్టు ప్రాంతాల్లో వర్షాకాలం నీటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత కూడా ఉంది. ఈ విషయాలపై అధికారులు ఏ మేరకు చర్యలు తీసుకుంటారోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి..

-సిద్దం శ్రీనివాస్, కాగజ్‌నగర్



అధికారులు పెండింగ్ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి. పట్టణ ముఖ తోరణం నిర్మించాలన్న ప్రతిపాదనలు అమలుకు నోచుకోవడం లేదు. సమీకృత మార్కెట్ పనులు సైతం వేగంగా పూర్తి చేయాలి.

మాస్టర్ ప్లాన్ అమలు చేయాలి..

-మాచర్ల శ్రీనివాస్, కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ పట్టణాభివృద్ధికి మాస్టర్ ప్లాన్ అమలు చేయాలి. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా వర్షాకాలంలో వరదలు వస్తే లోతట్టు ప్రాంతాలు మునిగిపోతున్నాయి. వేసవిలోనే ఈ సమస్యను పరిష్కరించాలి.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

హాజీపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పాలకుర్తి మండలం ఎల్కలపల్లి గ్రామానికి చెందిన కందుల నాగరాజు (27) సోమవారం రాత్రి మోటార్ సైకిల్ అదుపు తప్పి కింద పడి మృతి చెందినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. నాగరాజు తన ద్విచక్ర వాహనంపై ఎల్కలపల్లి గ్రామం నుంచి తన సొంత గ్రామమైన లక్ష్మీపూర్ గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వేగంగా వస్తుండగా గుడిపేట శివారులోని ఎల్లంపల్లి ప్రాజెక్టు కట్ట మూల మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. నాగరాజు తల్లి కందుల స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రైలు కింద పడి ఆటో డ్రైవర్ ఆత్మహత్య

మంచిర్యాల క్రైం, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణం ఏసీసీ సమీపంలో రైలు కింద పడి గోపాల్ అనే ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై మహేందర్ తెలిపారు. కుటుంబ సభ్యులు, ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం నెన్నెల మండల కేంద్రానికి చెందిన ఈగం లక్ష్మి రమేష్ దంపతుల కుమారుడైన గోపాల్ అచ్చలాపూరానికి చెందిన వనితను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. గోపాల్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా భార్యభర్తలిద్దరికి మనస్పర్థలు ఏర్పడ్డాయి. వనితతో జరుగుతున్న గొడవ లకు మనస్థాపం చెందిన గోపాల్ జీవితంపై విరక్తి పొంది మంచిర్యాల ఏసీసీ వెనుక రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గోపాల్‌కు కుమారుడు, కూతురు ఉన్నారు. గోపాల్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తహసీల్దార్ ఎదుట ఇద్దరి బైండోవర్

జన్నారం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కవ్వాల టైగర్ జోన్‌లోని జన్నారం డివిజన్‌లో గల జన్నారం గ్రామానికిచెందిన కబీర్‌ఖాన్, మాదాసు మల్లేష్‌లను తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి ముందు మంగళవారం బైండోవర్ చేసినట్లు ఎఫ్ఆర్‌వో సుష్మారావు తెలిపారు. వీరిద్దరు కలపను తరలిస్తున్నారని బైండోవర్ చేసినట్లు తెలిపారు. అక్రమంగా కలప రవాణా చేసినా, నిల్వ చేసినా చర్యలుంటాయని హెచ్చరించారు.

భర్త ఆచూకీ తెలపాలని వివాహిత ఆవేదన

చెన్నూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : తన భర్త కనిపించడం లేదని, ఆచూకీ తెలపాలని భార్య వసుధ మంగళవారం ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త చెన్నూరు పట్టణానికి చెందిన మగ్గిడి రమేష్ కూరగాయల విత్తనాల విక్రయ వ్యాపారం చేసేవాడని, రెండు నెలల నుంచి అదృశ్యమయ్యాడని తెలిపింది. నవంబరు 27న విత్తనాలు కొనుగోలు చేయడానికి మంచిర్యాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని పేర్కొంది. రెండు నెలల క్రితమే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇంత వరకు ఎలాంటి సమాచారం లభించలేదంది. తన భర్త కనిపిస్తే 9010165662కు సమా చారం అందించాలని కోరింది. ఈ విషయంపై సీఐ మాట్లాడుతూ కేసు నమోదు చేశామని, అన్ని పోలీస్ స్టేషన్‌లకు సమాచారం పంపించామని తెలిపారు.

పనుల పరిశీలన

కాగజ్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం చింతగూడలో అభివృద్ధి పనులు ఏపీవో బుచ్చన్న పరిశీలించారు. ఈ సందర్భంగా షెడ్డు నిర్మాణం కోసం చేపట్టిన మార్కెట్‌ను పరిశీలించారు. ఆయన వెంట శ్రావణ్‌కుమార్, సాంకేతిక సహాయకురాలు రమాదేవి, రాజేంద్ర ప్రసాద్ తదితరులు ఉన్నారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి

గంగాధర, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల శివారులో అనుమానాస్పదంగా మృతి చెందిన మహిళ మంచిర్యాల వాసిగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. సోమవారం కురిక్యాల శివారు పంటచేనులో వివాహిత మహిళ మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మహిళ మృతి వార్త వివిధ పత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో చూసిన మంచిర్యాలకు చెందిన వారు గంగాధర పోలీసులకు సమాచారం అందించారు. ప్రస్తుతం మహిళ మృతదేహం కరీంనగర్ మార్చురీలో భద్రపరచారు. మంచిర్యాల నుంచి ఇక్కడికి ఎందుకు వచ్చింది, ఎవరు తీసుకువచ్చారు, అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. మహిళ ముక్కు, ముఖంపై రక్తపు మరకలుండగా పోలీసులు ప్రాథమికంగా హత్యగానే నిర్ధారణకు వచ్చా రు. అనుమానం వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు వచ్చి నిర్ధారిస్తే గాని ఆమె పూర్తి వివరాలు వెల్లడిస్తామని, పోస్టుమార్టం రిపోర్ట్ ఆధారంగా హత్యనా, ఆత్మహత్యనా అనే విషయాలు తెలుస్తాయని ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

నాలుగు నెలల క్రితం వెళ్లి.. మృతదేహంగా మారి

కాసిపేట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కాసిపేట మండల కేంద్రానికి చెందిన మేడ భరత్ ఆసిఫాబాద్ కుమరం భీం జిల్లా పెంచికల్‌పేటకు చెందిన మమత(30)తో ఐదేళ్లుగా సహ జీవనం చేస్తున్నారు. వీరికి ఒక బాబు ధృవన్ (4) ఉన్నాడు. కొంత కాలంగా ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో తరచూ గొడవ పడుతున్నారు. నిత్యం మమతను భరత్ వేధించేవాడు. దీంతో తట్టుకోలేక గత ఏడాది అక్టోబరులో మమత ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. మమతకు తల్లిదండ్రులు లేరు. ఒంటరి కావడంతో ఆమె ఆచూకీ కోసం ఎవరూ గాలించలేదు. మంగళవారం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల శివారు ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహం లభించింది. ఆమె వద్ద లభించిన ఆధారాల ప్రకారం మృతదేహం మమతదిగా గుర్తించారు.

పేకాట స్థావరంపై దాడి

కెరమెరి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలం సుల్తాన్‌గూడ గ్రామ సమీపంలోని పంట చేనులో ఎస్సై విజయ్ ఆధ్వర్యంలో పేకాట స్థావంపై మంగళవారం దాడి చేశారు. ఈ మేరకు ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు.

నాడు జలకళ.. నేడు వెలవెల

నాడు


వర్షాకాలం నిండు కుండలా ప్రవహిస్తున్న పెద్దవాగు

పెంచికలపేట, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పెంచికలపేట- దహెగాం మండలాల మధ్య ప్రవహిస్తున్న పెద్దవాగు వర్షాకాలం నిండు కుండలా ప్రవహిస్తూ ఆహ్లాదకర వాతావరణాన్ని పంచింది. ఈ ఏడాడి జూలే, ఆగస్టు నెలల్లో వర్షాలు కురువ డంతో నిండా నీరు పారింది. అక్టోబరు నుంచి భారీ వర్షాలు లేక పోవడంతో పైనుంచి వరదనీరు తగ్గిపోయింది. దీంతో ప్రస్తుతం నీటి మట్టం లేక బోసిపోతోంది.

నేడు


వెలవెలబోతున్న పెద్దవాగు

ప్రమాదరహిత బొగ్గు ఉత్పత్తే లక్ష్యం

● జీఎం దేవేందర్
● సిబ్బంది రక్షణ సూత్రాలు పాటించాలని సూచన


మాట్లాడుతున్న మందమర్రి జీఎం దేవేందర్

మందమర్రి టౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : ప్రమాద రహిత బొగ్గు ఉత్పత్తే యాజమాన్యం ప్రధాన లక్ష్యమని, అధికారులు, కార్మికులు విధిగా రక్షణ సూత్రాలు పాటిస్తూ విధులు నిర్వహించాలని మంద మర్రి జీఎం దేవేందర్, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ అధికారి రఘుకుమార్ అన్నారు. మంగళవారం కాన్ఫరెన్సు హాల్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మా ట్లాడారు. అధికారులు, సూపర్‌వైజర్లు పని ప్రదేశాలను పరిశీలించాలని సూచించారు. కార్మికులు కూడా పని ప్రదేశాల్లో రక్షణ చర్యలు పాటించాలన్నారు. ప్రతి రోజు విధిగా కార్మికులు రక్షణ సూత్రాలు పాటించడం వల్ల ప్రమాదాలు జరగవని చెప్పారు. నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు జరుగుతాయని అన్నారు. సింగరేణిలో ప్రమాదాల నివార ణకు యాజమాన్యం అత్యంత సాంకేతిక పరి జ్ఞానంతో ముందుకు వెళ్తుందని అన్నారు. కార్మికులకు ప్రమాదాలు జరిగితే వారి కుటుంబాలకు కాకుండా సంస్థకు కూడా తీరని నష్టం జరుగుతుందన్నారు. కార్మికులు, అధికారులు తేడా లేకుండా అంకిత భావంతో పని చేయాలని చెప్పారు. ప్రమాదాలు లేని సింగరేణి సంస్థ ఏకైక లక్ష్యంగా అందరు ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం విజయప్రసాద్, అన్ని గనుల రక్షణాధికారులు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి రోడ్డును పునరుద్ధరించాలి

జైపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రామారావుపేట గ్రామంలోని గోదావరి రోడ్డును సింగరేణి అధికారులు మూసివేశా రని, మూసివేసిన రోడ్డును తిరిగి పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరారు. మంగళవారం మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ వనజారెడ్డి మూసివేసిన రోడ్డును పరిశీలించారు. గ్రామస్థులతో మాట్లాడి సమస్య అడిగి తెలుసుకున్నారు. రోడ్డు మూసివేయడంతో ఇబ్బందులు పడుతున్నామని , చర్యలు తీసుకోవాలని కోరారు. ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఆర్డీవో, తహసీల్దార్ గ్రామస్థులకు తెలిపారు. అనంతరం మంచిర్యాల ఆర్డీవో కార్యాలయానికి గ్రామస్థులకు వెళ్లి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పెద్దల బాపు, గ్రామస్థులు నామాల నాగరాజు, గోలి వెంకటేష్, గుండ శ్రీనివాస్, వెంకటేష్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా స్విమ్మింగ్ పూల్స్

మందమర్రి టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఆర్ క్లబ్‌తో పాటు రామకృష్ణాపూర్ క్లబ్‌లో లక్షల వ్యయంతో నిర్మించిన స్విమ్మింగ్ పూల్స్ నిరుపయోగంగా మారాయని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియా కార్యదర్శి బీమనాథుని సుదర్శన్‌లు అన్నారు. మందమర్రిలో మంగళ వారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ స్విమ్మింగ్ పూల్స్‌లో వాటర్ ఫిల్టర్ లేకపోవడం వల్ల నల్లగా మారాయని చెప్పారు. నీరు కూడా దుర్గంధం వెదజల్లుతుందని అన్నారు. సమస్యను ఇప్పటికే జీఎం దృష్టికి తీసుకుపోయామని తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు పట్టించుకోకుంటే ఆందోళనలు చేపడుతామని తెలిపారు. సమావేశంలో సోమిశెట్టి రాజేషం తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్ఎంఎస్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

శ్రీరాంపూర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో పనిచేసి రిటైర్/అన్‌ఫిట్/మరణించిన ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు మెడికల్ కార్డుల కోసం సీపీఆర్ఎంఎస్-ఎన్ఈ(మోడిఫైడ్) పథకంలో చేరాలని శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం(పర్సనల్) అరవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యత్వం పొందగోరే వారు 60 వేల రూపాయలు చెలల్లించాల్సి ఉంటుందని, ఉద్యోగులకు గతంలో డబ్బులు కట్ అయినట్లయితే మిగిలిన మొత్తాన్ని చెల్లించాలని పేర్కొన్నారు. కార్డులు అవసరమైన వారు సంబంధిత గనులు, విభాగాలలో సంక్షేమా ధికారి, కార్యాలయ సిబ్బందికి తగిన పత్రా లతో మార్చి 31వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

సింగరేణి సమాచారం



కళాకారులకు సన్మానం


రవీంద్రకుమారస్వామి, శ్రీనిధిలను సన్మానిస్తున్న ఎస్టీపీపీ అధికారులు

జైపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కోలిండియాలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించిన ఇంటర్ కంపెనీ కల్చరల్ మీట్ 2024-25 పోటీల్లో బహుమతుల సాధించిన కళాకారులనుమంగళవారం ఎస్టీపీపీలో ఇన్‌చార్జ్ ఈడీ శ్రీనివాసులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైపూర్‌లోని ఎస్టీపీపీలో ఫోర్‌మెన్ ఎలక్ట్రికల్‌గా పనిచేస్తున్న రవీంద్రకుమారస్వామి వేణు గానంలో, సీనియర్ అసిస్టెంట్ శ్రీనిధి కర్ణాటక సంగీతంలో మొదటి బహుమతులు సాధించారని చెప్పారు. వీరిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచింఆచరు. కార్యక్రమంలో అధికారులు జేఎన్ సింగ్, పర్సయ్య, శబ్బూశ్రినివఆస్, సుధాకర్, మదన్‌మోహన్, తుకారం పాల్గొన్నారు.

ఉత్తమ అధికారికి సన్మానం

శ్రీరాంపూర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా నుంచి ఉత్తమ అధికారిగా ఎన్నికై సీఎండీ బలరాం చేతులమీదుగా సన్మానం పొందిన అధికారి పూర్ణచందర్‌ను ఎస్ఆర్‌పీ 3 అధికారులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గని మేనేజర్ వెంకట్రావ్ మాట్లాడుతూ, పూర్ణచందర్ సీనియర్ అండర్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తూ విధుల్లో నిబద్ధత, అంకితభావం కనబరుస్తున్నారని తెలిపారు. సంస్థ నిర్ధేశించిన లక్ష్యాలను నెరవేర్చడంలో ఆయన ముందున్నారని కొనియాడారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి మహేందర్, సంక్షేమాధికారి సాధన్, పిట్ ఇంజనీర్ ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

మార్గం సుగమం..

(5వ పేజీ తరువాయి)

ఉన్నప్పుడు వార్డుకు కనీసం 2500 మంది ఓటర్లు ఉండేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య పెరగనుండగా గతంలో ఉన్న వార్డుల రూపురేఖలు మారనున్నాయి.

● రికార్డులు స్వాధీనం దిశగా...

మంచిర్యాల కార్పొరేషన్‌లో విలీనమైన నస్పూర్ మున్సిపాలిటీతో పాటు హాజీపూర్ మండలంలోని గ్రామాల్లో పరిపాలన రికార్డులను స్వాధీనం చేసుకునేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. రికార్డుల స్వాధీనం, ఇతర కార్యాచరణ పూర్తి చేయడం ద్వారా కార్పొరేషన్ పాలన సాగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా కార్పొరేషన్‌లో విలీనం అయ్యే గ్రామాల్లో పన్నులు పెరుగుతాయనే ప్రచారం జరుగుతుండగా, మూడేళ్ల వరకు ఎలాంటి పెంపు ఉండబోదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ తొలి కమిషనర్‌గా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న మారుతీ ప్రసాద్ బాధ్యతలు నిర్వహించనున్నారు.

సిగ్లీగర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రంజిత్‌సింగ్



లక్షెట్టిపేట, జనవరి, 28 (ఆంధ్రజ్యోతి): సిగ్లిగర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన సర్ధార్ రంజిత్ సింగ్‌ను ఎంపిక చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని కిషాన్‌బాగ్ ఆశాసింగ్ గురుద్వార్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో 33జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు ఆయన చేస్తున్న సేవలను గుర్తించి రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా ఎన్నుకున్నారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన రాష్ట్ర కమిటీ సభ్యులతో పాటు 33జిల్లాల అధ్యక్ష కార్యదర్శులకు రంజిత్‌సింగ్ కృతజ్ఞతలు తెలిపాడు. ఆనంతరం రాష్ట్ర కమిటీ సభ్యులు నూతనంగా ఎన్నికైన సందర్భంగా ఘనంగా పూల మాలలు శాలువాలతో సన్మానించారు.

పాఠశాలలకు వంట సామగ్రి వితరణ

కోటపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పారుపెల్లి గ్రామంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు చెన్నూరుకు చెందిన కమ్మ సేవా సమితి సభ్యులు బెజవాడ లక్ష్మీనారాయణ రూ. 16 వేలు విలువైన వంట పాత్రలను, విద్యార్థులకు ప్లేట్లను మంగళవారం అందించారు. ఈ కార్యక్రమంలో కమ్మ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొల్లి విష్ణువర్ధన్‌రావు, అధ్యక్షుడు వడ్డే వినయ్, కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు, సమన్వయకర్త కృష్ణమూర్తి, పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్‌తో పాటు గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ లోపం..కొనుగోలుదారులకు శాపం

- మార్కెట్ భవనంలో ఇష్టారాజ్యంగా కూరగాయలు విక్రయాలు
- ఖాళీగా దర్శనమిస్తున్న స్టాల్స్
- ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు, కొనుగోలుదారులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



కూరగాయల మార్కెట్ భవనంలో ఖాళీగా దర్శనమిస్తున్న స్టాల్స్

బెల్లంపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద నూతనంగా నిర్మించిన కూరగాయల మార్కెట్ భవనంపై అధికారుల పర్యవేక్షణ లోపంతో వ్యాపారస్థులు, కొనుగోలు దారులు ఇబ్బందులు పడుతున్నారు. రూ.కోట్ల రూపాయల నిధులతో నిర్మించిన ఈ భవనం అస్తవ్యస్తంగా మారింది. మార్కెట్ భవనంలో వ్యాపారులకు కేటా యించిన స్టాల్స్‌లో కూరగాయలు విక్రయించకుండా స్టాల్స్ ముందు విక్రయిస్తుండడంతో కొనుగోలు దారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో తరచూ వ్యాపారస్థుల మధ్య వాగ్వాదాలు చోటు చేసుకుంటున్నాయి. సంబంధిత మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లేక పోవడంతో మార్కెట్ గాడి తప్పుతోంది.

● రూ.7.58కోట్లతో మార్కెట్ భవనం ప్రారంభం..

పట్టణంలోని కాంటాచౌరస్తా వద్ద ఐదు నెలల క్రితం రూ.7.58 కోట్ల నిధులతో నూతనంగా కూరగాయల మార్కెట్ భవనాన్ని ఎమ్మెల్యే గడ్డం వినోద్‌తోపాటు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్, ఎంపీ గడ్డం వంశీ, కలెక్టర్ కుమార్ దీపక్ ప్రారంభించారు. ఈ భవనంలో ఆధునిక వసతులతో సమీకృత కూరగాయల మార్కెట్ పనులను చేపట్టారు. జీప్లస్‌వన్ భవన నిర్మాణ పనులను ప్రారంభించగా గ్రౌండ్ ఫ్లోర్ పూర్తి కావడంతో 108 మంది వ్యాపారులకు స్టాల్స్‌ను కేటాయించారు.

● స్టాల్స్‌లో విక్రయించని వైనం..

సమీకృత కూరగాయల మార్కెట్ భవనంలో వ్యాపారస్థులకు 108స్టాల్స్‌ను కలెక్టర్ కేటాయించారు. ఒక్కో స్టాల్‌కు రూ.10 వేల డిపాజిట్‌తో పాటు ప్రతినెల కిరాయి వెయ్యి రూపాయల చొప్పున మున్సిపల్ అధికారులు తీసుకుంటున్నారు. కొందరు తమకు కేటాయించిన స్టాల్స్‌లో కూరగాయలు విక్రయించకుండా స్టాల్స్ ముందు, మరికొందరు భవనంలోని ఖాళీస్థలంలో ఎక్కడపడితే అక్కడ విక్రయిస్తుండడంతో కొనుగోలుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్టాల్స్ ముందు కూరగాయలను విక్రయిస్తుండ డంతో మార్కెట్ భవనంలో రద్దీ ఏర్పడుతోంది. దీంతో కొనుగోలుదారుల తోపాటు మరికొందరు స్టాల్స్‌కు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేసే పరిస్థితి ఉండడం లేదు. భవనంలో చివరికి ఉన్న



వ్యాపారస్థుల మధ్య గొడవ కావడంతో నచ్చచెబుతున్న పోలీసులు (ఫైల్)

కూరగాయల వ్యాపారుల స్టాల్స్‌కు కొనుగోలు దారులు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుండడంతో మిగతా వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. నాలుగు నెలలుగా వ్యాపారస్థుల మధ్య తరచూ గొడవలు చోటు చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తున్నారు.

మార్కెట్ సముదాయం ఎదుట పారిశుధ్య లోపం..

కోట్ల నిధులతో కూరగాయల మార్కెట్ భవనాన్ని నిర్మించినప్పటికీ భవన సముదాయంలో ప్రతిరోజు పారిశుధ్య లోపం కనిపిస్తోంది. వ్యాపార స్థులు పాడైన కూరగాయలు, పండ్లు, ఇతరత్రా వ్యర్థాలు అన్నీ భవన సముదాయం ఆవరణలో వేస్తున్నారు. మున్సిపల్ అధికారులు పారిశుధ్య పనులను చేపట్టాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోకపోవ డంతో ఎక్కడ చూసినా కుళ్లిన కూరగాయల కుప్పలు దర్శనమిస్తున్నాయి. దీంతో కొనుగోలుకు వస్తున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్‌శాఖ అధికారులతోపాటు కలెక్టర్, ప్రజాప్రతినిధులు పట్టించుకొని నూతన కూరగాయల మార్కెట్ భవనంలో వ్యాపారులకు కేటాయించిన స్టాల్స్‌లో విక్రయాలు జరిగేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.



కూరగాయల మార్కెట్ భవనం ఎదుట చెత్తా చెదారం

అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలి..

- పసులేటి వెంకటేష్, బెల్లంపల్లి



కోట్ల రూపాయలతో కూరగాయల మార్కెట్ భవనం నిర్మించినప్పటికీ అధికారులు, ప్రజాప్రతి నిధులు పట్టించుకోకపోవడంతో వ్యాపారస్థులకు కేటాయించిన స్టాళ్లలో కూరగాయలు విక్రయిం చడం లేదు. చాలామంది వ్యాపారులు స్టాళ్లముందు విక్రయిస్తుండడంతో కూరగాయలు కొనుగోలు చేసే సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మార్కెట్ సముదాయ ప్రాంతాల్లో వాహనాలు పార్కింగ్‌చేసే స్థలం శుభ్రంగా ఉండకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. భవనం ముందు కుళ్లిపోయిన కూరగాయలు, చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. అధికారులు వ్యాపారులు స్టాళ్లలోనే విక్రయించేలా చర్యలు తీసుకోవాలి.

అటవీ శాఖ నిబంధనలు పాటించాలి

ఫారెస్టు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్

కాసిపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అటవీ శాఖ నిబంధనలకు విరుద్ధంగా వడ్రంగి పనిచేసే వారు కలపను వినియోగించరాదని ఫారెస్టు డిప్యూటి రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్ అన్నారు. మంగళవారం కొండాపూర్‌లో వడ్రంగులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్థానికంగా ఉన్న వడ్రంగులు పర్మిట్ క్రనే వినియోగించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా కలపను వాడితే శాఖ పరంగా కఠిన చర్య లుంటాయని హెచ్చరించారు. అలాగే వడ్రంగుల ఇళ్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, అనుమతి లేని కలప దొరికితే పని యంత్రాలను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. ఇటీవల ధర్మారావుపేట సెక్షన్ పరిధిలో అనుమతి లేని కలపను వాడిన వారిపై కేసు నమోదు చేసి జరిమానా విధించామన్నారు. ఈ సమావేశంలో ముత్యంపల్లి, ధర్మారావు పేట అటవీ సెక్షన్‌ల పరిధిలోని వడ్రంగులు, అటవీ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫారెస్టు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్

యూనిఫైడ్ పెన్షన్ స్కీంను వ్యతిరేకిస్తున్నాం

గర్మిళ్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం ప్రభుత్వం అమలు చేయబోతున్న యూనిఫైడ్ పెన్షన్ స్కీంను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని టీఎస్ సీపీఎస్ గౌరవ సలహాదారుడు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి అన్నారు. మంగళవారం మంచిర్యాలలోని మోడల్ స్కూల్‌లో గెజిట్ ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004 తర్వాత నియామకమైన ఉద్యోగ, ఉపాధ్యాయులందరికి సీపీఎస్‌ను అమలు పరుస్తూ ఉద్యోగులను ఇప్పటికే ప్రభుత్వం దగా చేస్తుందన్నారు. ఉద్యోగులుగా సర్వీసులో ఉన్న సమయంలోనే ఏ మాత్రం భద్రతకు భరోసా లేకుండా చేసిన కేంద్ర ప్రభుత్వం మళ్లీ ఇంకో కొత్త దగా స్కీంను ప్రవేశపెట్టడం సరైంది కాదన్నారు. వెంటనే ఈ పెన్షన్ స్కీమును రద్దు చేసి పాత పింఛన్ అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీఎస్ సీపీఎస్ నాయకులు

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

బెల్లంపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై మంగళవారం 15వ సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌డీవో కిషన్ హాజరయ్యారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలోని 11 గ్రామాల్లో చేపట్టిన వివిధ పనుల నివేదికలను చదివి వినిపించారు. పనుల్లో జరిగిన అవకతవకలపై రూ. 14, 237 జరిమానా విధించ గా రూ. 1237 రికవరీ చేసినట్లు డీఆర్‌డీవో తెలిపారు. అలాగే మండలానికి కొత్తగా రూ. 20 కోట్ల వివిధ అభి వృద్ధి పనుల కోసం నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపా రు. ఈ నిధులతో నర్సరీలను ఏర్పాటు చేయాలన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించిన ఎంబీలను ఫిబ్రవరి 10లోగా పూర్తి చేయాలన్నారు. సామాజిక తనిఖీ ప్రజావేదికలో రూ. 3.67 కోట్ల పనులకు సంబంధించి ఆడిట్ నిర్వహించినట్లు డీఆర్‌డీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి కిరణ్, ఎంపీడీవో మహేందర్, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజావేదికలో ఆడిట్ నిర్వహిస్తున్న డీఆర్‌డీవో, అధికారులు

ఎమ్మెల్యే దంపతులకు సత్యదేవుడి కల్యాణ ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఈవో

దండేపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామి దేవస్థానంలో వచ్చే 6నుంచి 13వరకు జరిగే స్వామి వారి కల్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు-సురేఖ దంపతులకు సత్యదేవుని కల్యాణానికి హాజరు కావాలని ఆహ్వానం పత్రిక అందజేశారు. మంగళవారం మంచిర్యాలలో ఆయన నివాసం గృహంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ అర్చకులతో కలిసారు. అనంతరం వేదపండితులు, అర్చకులు ఎమ్మెల్యే దంపతులకు సత్కరించి ప్రసాదం అందజేశారు.

పాఠశాల ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ

మందమర్రిరూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శంకర్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి మంగళవారం ఎంపీడీవో రాజేశ్వర్, కాంగ్రెస్ నాయకులు గండె రాంచందర్, ఒడ్నాల కొమురయ్యలు భూమి పూజ చేశారు. ఈజీఎస్ నిధులు రూ. 5.18 లక్షలతో ప్రహరీ నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రజియాసుల్తానా, టీఏ రాజమల్లు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

బెల్లంపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లిలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ విద్యార్థులు అండర్ 14 సాఫ్ట్ బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దూట శ్రీధర్ తెలిపారు. విద్యార్థులు శ్రీహర్షవర్ధన్, విశ్వతేజ, వర్షిత్, అసిత్, సంకిత్, సాయి, రిషేంద్రవర్మ, రూపి కేష్‌లు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులను జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఫణిరాజా, వ్యాయామ ఉపాధ్యాయులు వామన్, రాజశేఖర్ అభినందించారు.

'లక్ష డప్పులు వేయి గొంతులను' విజయవంతం చేయాలి

మందమర్రిటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణకు తీర్పును అమలు చేయాలని ఫిబ్రవరి 2న హైద్రాబాద్‌లో తలపెట్టిన లక్ష డప్పులు వేల గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ తెలిపారు. మంగళవారం రాత్రి హైద్రాబాద్‌లో జరిగిన మాదిగ డాక్టర్ల జేఏసీ సమావేశానికి హాజరై మాట్లాడారు. లక్ష డప్పులు, వేయి గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మంచిర్యాల జిల్లా మాదిగ డాక్టర్ల జేఏసీ నాయకులు డాక్టర్ శరత్‌బాబు మాట్లాడుతూ 59 ఉపకులాల ఉమ్మడి రిజర్వేషన్ ఒకేసామాజిక వర్గమే లబ్ధి పొందిందన్నారు.

ఏబీసీడీ వర్గీకరణ ద్వారా 59 ఉపకులాలకు రిజర్వేషన్ సమాన వాటా దక్కుతుందన్నారు. అంతకు ముందు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ వచ్చిన సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చం అందజేశారు. కార్యక్రమంలో మంచి ర్యాల, మందమర్రి డాక్టర్లు పాల్గొన్నారు.

●ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరించాలని, సుప్రింకోర్టు తీర్పును అమలు చేయాలని వచ్చే నెల 7న తలపెట్టిన లక్ష డప్పులు వేల గొంతుల కార్యక్రమంలో హైదరాబాద్ రాజధాని దద్దరి ల్లడం ఖాయమని ఎమ్మార్పీఎస్, కాంగ్రెస్ నాయకులు మంతెన సంపత్ తెలిపారు. మంగళవారం విలేకరులకు పంపిన ప్రకటనలో మూడు దశాబ్దాల పాటు మందకృష్ణ మాదిగ తమకు లాలకే కాకుం డా 58 ఉప కులాలకు న్యాయం జరగాలని పోరాడారన్నారు. వర్గీకరణకు అనుకూలంగా ఉన్నా కొందరు దీనిని అడ్డుకుంటున్నారని, ఇప్పటికైనా వాస్తవాలను తెలుసుకొని వర్గీకరణకు సహకరించాలని ఆయన తెలిపారు.



మందకృష్ణమాదిగకు పుష్పగుచ్చం అందిస్తున్న డాక్టర్స్ జేఏసీ నాయకులు

మాదక ద్రవ్యాల నివారణలో.. ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలి

కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల నివారణకు ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో మాదక ద్రవ్యాల నియంత్రణపై డీసీపీ భాస్కర్, ఆర్డీవో శ్రీనివాసరావు, జిల్లా అబ్కారీమద్యనిషేధ శాఖ అధికారి నంద గోపాల్‌తో కలిసి అధికారు లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల ఉత్పత్తి, రవాణా విక్రయం, వినియోగాలను నిరోధించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఇందులో భాగంగా పాఠశాల స్థాయిలో ప్రహరీ క్లబ్స్ నిర్వహిస్తామన్నారు. బుధవారం పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. మాదక ద్రవ్యాలు నియంత్రించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందని, విద్యార్థులు అసాధారణ ప్రవర్తనను పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. డీసీపీ మాట్లాడుతూ జిల్లాలో 2024 సంవత్సరంలో మాదక ద్రవ్యాలకు సంబంధించి 63 కేసులు నమోదు కాగా 167 మంది అరెస్టు అయ్యారని, 2023లో 53 కేసుల్లో 82 మంది అరెస్టు అయ్యారని తెలిపారు.

మాదక ద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

అర్హులైన రజకులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

శ్రీరాంపూర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అర్హులైన రజకులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి పాయిరాల రాములు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంగెపు హనుమంతు అన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సింగాపూర్ ఆర్ అండ్ ఆర్ కాలనీ పునరావాస స్థలంలో రజకులకు దోబీఘాట్లు నిర్మించి ఇవ్వాలని, ప్రభుత్వ సంస్థల్లో రజకులకు అవకాశం కల్పించాలని, వృత్తిదారులకు ఆరోగ్య కార్డులు అందించాలని, సొసైటీల ద్వారా రుణాలు అందించి ఆదుకోవాలని కోరారు. కేవలం ఎన్నికల సమయంలోనే హామీలు ఇచ్చి మర్చిపోకుండా పథకాలు వారికి కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కొండపర్తి రవి, ఉపాధ్యక్షుడిగా పాయిరాల శంకర్, కార్యదర్శిగా ఇందూర్, సహాయ కార్యదర్శిగా ప్రశాంత్, తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నస్పూర్, శ్రీరాంపూర్, బీజోన్, మందమర్రి ఏరియాల అధ్యక్షులు కొత్తకొండ రామస్వామి, ముత్తునూరి అందజయ్య, నడిగోట తిరుపతి, గంగరాజుల రాంచందర్, పాల్గొన్నారు.

బీసీ రాజకీయ యుద్ధభేరి సభ కరపత్రాల విడుదల

చెన్నూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ ప్రాంగణం ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో ఫిబ్రబరి 2న జరిగే బీసీ రాజకీయ యుద్ధభేరి సభ కరపత్రాలను మంగళవారం చెన్నూరు పట్టణంలో బీసీ జేఏసీ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించి, బీసీ నిరుద్యోగుల పాలిట శాపంగా మారిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సభలో పెద్ద సంఖ్యలో బీసీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి మనోహర్, నాయకులు మహేశ్ వర్మ, గణేష్,రవీందర్, సంజీవ్, రవికుమార్‌గౌడ్, రాజశేఖర్, ప్రశాంత్, రాజన్న, చందు, వెంకటస్వామిగౌడ్, నారాయణ, బాపన్నయాదవ్, దుర్గయ్య, సంతోష్, రాజన్న, బాపు, సమ్మయ్య పాల్గొన్నారు.

బీమా పాలసీపై సమావేశం

కన్నెపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెబ్బెన గ్రామంలో నాబార్డు సౌజన్యంతో పోస్టల్ డిపార్ట్‌మెంట్ మేనేజర్ వెంకట్ బీమా పాలసీపై ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 18 నుంచి 65 ఏళ్ల వరకు రూ. 10 లక్షల ప్రమాద బీమాకు రూ. 520, రూ. 15 లక్షల బీమాకు రూ. 775 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సాగర్, సాయికిరణ్, సాయి ష్మ, ప్రజలు పాల్గొన్నారు.

బేటీ బచావో బేటీ పడావో దశాబ్ది ఉత్సవాలు

కోటపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పీఎం శ్రీ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో మంగళవారం జిల్లా మహిళ సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థినులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. మహిళ సాధికారత కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ సౌజన్య మాట్లాడుతూ పథకం కార ణాలను, లక్ష్యాలను వివరించారు. ఆడ పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి పాటించాల్సిన జాగ్రత్తలపై సూచించారు. బాలికలకు ఏదైనా సమస్య ఎదురైనప్పుడు 1098కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్, మహిళ సాధికారత కేంద్రం స్పెషలిస్టు విజయ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

టీఎన్‌జీవో క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల లో టీఎన్‌జీవో డైరీ, క్యాలెండర్‌ను మంగళవారం ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు, కలెక్టర్ కుమార్ దీపక్‌లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, రామ్మోహన్, మల్లయ్య, బాపురావు, సతీష్‌కుమార్, కేజి యారాణి, సునీత, పద్మలత, శ్రావణ్, గోపాల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు తగవు..

కాసిపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసి ఇర్ఫాన్ అనే వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ ఆడె జంగు అన్నారు. మంగళవారం దేవాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపై ఖానాపూర్‌కు చెందిన ఇర్ఫాన్ ఎండీసీ వాట్సాప్ గ్రూపులో అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా అవమానకరంగా సంబోధించాడన్నారు. ఈ సమావేశంలో ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ కిషన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మడావి అనంతరావు, జిల్లా ఉపాధ్యక్షుడు జంగు, సోయం సూరు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

జన్నారం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : తిమ్మాపూర్ గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయిన గొల్కొండ పోచమల్లు కుటుంబాన్ని మంగళవారం కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ పరామర్శించారు. రూ. 10 వేల నగదు, నిత్యవసర సరుకులు అందజేశారు. మంత్రి సీతక్కతో మాట్లాడి ఇందిరమ్మ ఇల్లు వచ్చే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం ద్వారా రూ. 95 వేలు తక్షణ సాయం అందించడానికి తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి త్వరగా వచ్చేలా చూడాలని సూచించారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
5
బుధవారం 29 జనవరి 2025



మార్గం సుగమం..



మంచిర్యాల మున్సిపల్ కార్యాలయం



మున్సిపల్ కార్పొరేషన్ మ్యాప్

- కార్పొరేషన్‌గా మంచిర్యాల మున్సిపాలిటీ
- 50 డివిజన్లతో ఏర్పాటు
- నస్పూర్ మున్సిపాలిటీ సహా ఆరు గ్రామాలు విలీనం
- జీవో జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- విలీన గ్రామాల్లోని రికార్డుల స్వాధీనానికి సన్నాహాలు

మంచిర్యాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయనున్నట్లు అసెంబ్లీలో డిసెంబరు 19న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించిన విషయం తెలిసిందే. అనంతరం అసెంబ్లీలో ఈ విషయమై తీర్మానం చేయ గా, ఈ నెల 18న ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిం ది. ప్రభుత్వం జీవో కూడా విడుదల చేసింది. దీతో మంచిర్యాల కార్పొరేషన్‌గా అవతరించగా, 50 డివిజన్లను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

మంచిర్యాలకు ప్రత్యేక స్థానం...

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే మంచిర్యాల పట్టణానికి ప్రత్యేక స్థానం ఉంది. పారిశ్రామికంగా అభి వృద్ధి చెందడంతోపాటు ప్రధాన రైల్వే మార్గం అందు బాటులో ఉండటంతో వేగంగా అభివృద్ధి సాధించింది. మొదటి సారిగా 1956లో మంచిర్యాల మున్సిపాలిటీగా ఏర్పాటు కాగా, అప్పటి నుంచి అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతోంది. 2016లో మంచిర్యాల పట్టణం జిల్లా కేంద్రంగా ఏర్పడ్డ తరువాత మరింతగా అభివృ ద్ధి చెందింది. ప్రస్తుతం 36 వార్డులతో ఉన్న మంచిర్యాల విద్య, వైద్య సదుపాయాలకు నిలయంగా ఉం డి, నివాసానికి అనుకూలంగా ఉంది. మంచిర్యాల చు ట్టు పక్కల బొగ్గు బావులు, సిరామిక్ ఇండస్ట్రీలతోపాటు, విద్యుత్ పరిశ్రమలు ఉన్నాయి. వాణిజ్యపరంగా అభివృద్ధి చెందిన ప్రాంతంగా పేరుంది. ప్రస్తుతం మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటైనందున మరింతగా అభివృద్ధి చెందే అవకాశాలున్నాయి. జిల్లా కేంద్రంగా ఏర్పడ్డ నాటి నుంచే మంచిర్యాల మునిసిపల్ కార్పొరేషన్‌గా అవతరించనుందనే ప్రచారం చోటు చేసుకుం ది. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా అది కార్యరూ పం దాల్చలేదు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ప్రత్యేక చొరవతో ఎట్టకేలకు మంచిర్యాల మున్సిపాలి టీ కార్పొరేషన్‌గా అవతరించింది. ఎమ్మెల్యేగా ఎన్నికై న నాటి నుంచే ప్రేంసాగర్‌రావు మున్సిపల్ కార్పొరే షన్‌పై ప్రత్యేక దృష్టి సారించడంతో కొన్నాళ్లుగా ప్ర జలను ఊరిస్తూ వస్తున్న కల నెరవేరినట్లయింది.

50 డివిజన్లు ఏర్పాటు..

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో 50 డివిజన్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటి వరకు మంచి ర్యాల మున్సిపాలిటీలో ఉన్న 36 వార్డులు, నస్పూర్‌లో ఉన్న 25 వార్డులతోపాటు విలీన గ్రామాలను కలుపుకొని డివిజన్‌కు కనీసం 3,500, గరిష్ఠంగా 5000 ఓటర్లు ఉండేలా 50 డివిజన్లు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా ఇప్పుడున్న వార్డుల్లో మార్పులు, చేర్పులు చోటు చేసు కునే అవకాశం ఉంది. మున్సిపాలిటీగా

మిగతా 7లో

జనాభా ప్రాతిపదికన..

జనాభా ప్రాతిపదికన మంచిర్యాలను మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్య లు ప్రారంభించింది. ఇందులో భాగంగా నూతనంగా ఏర్పాటైన నస్పూర్ మున్సిపాలిటీతోపాటు హాజీపూర్ మండలంలోని వేంపల్లి, కొత్తపల్లి, పోచంపాడ్, ముల్కల్ల, గుడిపేట, చందనాపూర్, నర్సింగాపూర్, నంనూర్ గ్రామాలను విలీనం చేయనున్నట్లు గెజిట్‌లో పేర్కొన్నది.

మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలంటే జీవో నెంబర్ 571 ప్రకారం 2.5 నుంచి 3లక్షల జనాభా అవసరం ఉంటుంది. ఈ విషయంలో కొంచెం అటీటుగా ఉన్నా కార్పొరేషన్ చేసే అవకాశాలు ఉన్నట్లు జీవో చెబుతోంది. అలాగే 2011 జనాభా లెక్కల ప్రకారం మంచిర్యాల మున్సిపాలిటీలో 36 వార్డులకు గాను 87,153 మంది జనాభా ఉండగా, నస్పూర్‌లో మున్సిపాలిటీలో 25 వార్డులకు 76,641, అయితే 2021లో అధికారుల గణాంకాల ప్రకారం మంచిర్యాల మున్సిపాలిటీలో లక్షా 50వేలు, నస్పూర్‌లో 91,427, జనాభా ఉంది. అలాగే విలీన గ్రామాల్లో కనీసం 13వేల జనాభా వరకు ఉంటుందని అంచనా. 2022 ప్రకారం చూస్తే రెండు మున్సిపాలిటీలు, విలీనగ్రామాల్లో మొత్తం జనాభా 2,54,000 మంది ఉన్నారు. ఈ మూడేళ్లలో ఆయా స్థానిక సంస్థల పరిధిలో మరిం తగా జనాభా పెరగడం, 150చదరపు కిలోమీటర్ల వైశాల్యం ఉండటంతో కార్పొరేషన్ ఏర్పాటుకు మార్గం సుగమం అయింది.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

తాండూర్ సీఐ కుమారస్వామి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : శాంతి భద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

సీఐ : నేరాల నియం త్రణకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. మండలంలోని దుకాణాలు, దేవాలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రతీ ఒక్కరిపై సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : వారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

సీఐ : తరుచూగా వాహనాల తనిఖీలు చేస్తూ రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. మైన ర్లు బైకులు నడపకుండా చర్యలు తీసుకుంటున్నాం. మద్యం సేవించి వాహనాలు నడపకుండా డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీ లు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి : యువత మద్యం మత్తుకు బానిస కాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ : గ్రామాల్లోని యువకులు మద్యం, ఇతర మత్తుపదార్థాలకు బానిస కాకుండా అవగాహన కల్పిస్తున్నాం. చదువు, క్రీడా రంగంవైపు తీసుకురావడానికి ప్రోత్సహిస్తూ క్రీడా పరికరాలను అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : వారసంతలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

సీఐ : వారసంత జరిగే రోజున పోలీసు బందోబస్తు ఏర్పాటుచేస్తూ రోడ్డు పైన వాహనాలు నిలపకుండా పార్కింగ్ ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

-తాండూర్, ఆంధ్రజ్యోతి

తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించాలి

- సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

లక్షెట్టిపేట, జనవరి, 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చినమాట ప్రకారం తక్షణమే తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం పనులు మొదలు పెట్టాలని సీపీఐ (ఎంఎల్)న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి టీ.శ్రీనివాస్ డిమాండ్ చేసారు. పట్టణంలోని విశ్రాంతి భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతాంగం తుమ్మిడి హెట్టి పాజెక్టు నిర్మాణం జరిగితేనే సాగుకు సరిపడేంత నీరు అందుతుందన్నారు. 2008లో అప్పటి సీఎం వైఎస్. రాజశేఖరెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతుల కోసం 38కోట్ల రూపాయల నిధులను తుమ్మిడిహెట్టి కోసం మంజూరు చేసి శంకుస్థాపన కూడా చేసారన్నారు. సుమారు 9కోట్ల రూపాయల వరకు పనులు కూడా చేపట్టారన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక కేసీఆర్ స్వలాభం కోసం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాడని అంతే కాకుండా కాంట్రాక్టర్లతో కుమ్మక్కై, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలను నిర్మించారన్నారు. తుమ్మిడిహెట్టి నిర్మాణం చేపట్టేందుకు వాపకక్ష, అఖిల పార్టీల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో వచ్చే నెల 2న భారీ సదస్సు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి లాల్‌కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఏఐకెఎంఎస్ జిల్లా ఉపాధ్య క్షుడు దొండ ప్రభాకర్, జిల్లా నాయకుడు ప్రకాశం, సీపీఐ మండల కార్యదర్శి దేవవరం, ఏఐటీయూసీ మండల కార్యదర్శి రమణరెడ్డి, పాల్గొన్నారు.

వివాదాలు లేని భూములను కొనుగోలు చేయాలి

- జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అర్పిత మారంరెడ్డి

కాసిపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రైతులు సాగు భూముల ను కొనుగోలు చేసేటప్పుడు వివాదాలు లేని భూములను గుర్తించి పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాతనే భూములను కొనుగోలు చేయాలని జిల్లా న్యాయసేవా అధికార సంస్థకార్యదర్శి అర్పిత మారంరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతుల సాగుచట్టాలు, భూమి హక్కులు, ఇతర చట్టాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. రైతులు సాగు భూములను కొనుగోలు చేసేటప్పుడు సాదాబైనామాలతోనే సరిపెట్టు కోరాదని, తప్పకుండా భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రాజ్యాం గం ఆడపిల్లలకు సైతం తల్లితండ్రుల ఆస్తిలో వాటా కల్పించి దన్నారు. కోర్టు వివాదాలు లేకుండా భూ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మెంబర్ ఆర్ఆర్ రాములు, సహాయవ్య వసాయసంచాలకులు రాజనరేందర్, మండల వ్యవసాయాధికారి సీహెచ్ ప్రభాకర్, ఏఈవోలు రమ్య, సంధ్యారాణి పాల్గొన్నారు.

మేధావులందరూ గ్రామాల నుంచి వచ్చిన వారే

- యువ విద్యార్థులతోనే దేశ భవిష్యత్
- డీఆర్‌డీవో మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి

మంచిర్యాలక్రైం, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : పెద్ద పెద్ద మేధావులందరూ చిన్న చిన్న గ్రామాల నుంచే వచ్చారని, భారతదేశ భవి ష్యత్ యువ విద్యార్థులతోనే ముడిపడి ఉందని డీఆర్‌డీవో మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి అన్నారు. మంచిర్యాల జిల్లా శ్రీ ఉషోదయ ఉన్నత పాఠశాలలో కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్ (కేఐవైఈ) యార్లగడ్డ అభిరాం మెమోరియల్ వ్యవస్థాపకుడు నరేష్ గ్రామ సేవ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇన్స్పైర్ ఇండియా-2025 ఒక్క రోజు స్పేస్ డిఫెన్స్ ఎక్స్పో కార్యక్రమానికి ఆయన విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని వంద రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నారు. ఆయనతో పాటు ముఖ్య అతిథులుగా కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు హాజరయ్యారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధి యువతతోనే ఆధారపడి ఉందన్నారు. చిన్నచిన్న పల్లెలు, గ్రామ ప్రాంతాలు, చిన్న చిన్న పట్టణా ల్లో ఉండే విద్యార్థులను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కలాం మారుమూల పల్లె గ్రామాల్లో జన్మించి ఉపాధ్యాయుల స్ఫూర్తితో ఇస్రో శాస్త్రవేత్తగా, డీఆర్‌డీవో చైర్మన్‌గా, రాష్ట్రపతిగా ఎన్నికయ్యారన్నారు. నిజామాబా ద్‌కు వచ్చినప్పుడు విద్యార్థులు ఇస్రోను చూడాలని కోరడంతో చంద్రయాన్‌ను ప్రత్యక్షంగా చూసేందుకు వారిని తీసుకెళ్లామన్నారు. అందరినీ పరిశోధన కేంద్రానికి తీసుకెళ్లడం సాధ్యం కాదు కాబట్టే ఈ కార్యక్రమాన్ని వంద రోజుల పాటు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్‌ను బంగారుమయం చేసుకోవడంతో పాటు దేశ రక్షణతో తమ వంతు బాధ్యత నిర్వహించేందుకు వచ్చిన ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి విజ్ఞానాన్ని పెంపొందించుకొని స్పేస్, డిఫెన్స్ రంగాల్లోకి వెళ్లి సైంటిస్టుగా తయారు కావాలన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు...

ఎక్స్పోలో ముఖ్యంగా మిసేల్స్, నాగ్, అస్త్ర, జీఎస్ఎల్వీ, ఏఎస్ఎల్వీ, స్కేల్, చంద్రయాన్ 1,2,3తో పాటు ఇండియా గేట్, ఆర్యభట్ట ప్రదర్శనలు విద్యార్థులను ఎంతో ఆకట్టుకున్నాయి. విద్యార్థులు చేసిన దేశభక్తి నృత్యాలతో పాటు గుస్సాడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, డీఈవో యాదయ్య, ట్రస్మా మాజీ అధ్యక్షులు శేఖర్, ట్రస్మా మంచిర్యాల కరస్పాండెంట్ మధుబాబు, ఉషోదయ స్కూల్ ప్రిన్సిపాల్ బాలాజీ, ఉడారి చంద్రమోహన్, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



చంద్రయాన్ 3ని వివరిస్తున్న విద్యార్థులు

విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలి

- అదనపు కలెక్టర్ మోతిలాల్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఇష్టపడి చదివి ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వెనకబడిన తరగుతల సంక్షేమ వసతి గృహంలో 10వతరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రేరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 2025 వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులు, ఉద్యోగులుగా ఎంపికైన వారిని సన్మానించి, జాతీయ స్థాయిలో అండర్ 17 క్రికెట్ జట్టుకు ఎంపికైన జైపూర్ వెనకబడిన తరగతుల సంక్షేమబాలికల వసతి గృహ విద్యార్థిని సంజనను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురు షోత్తం నాయక్, డీఈవో యాదయ్య, వసతి గృహం అధికారులు భాగ్యవతి, శ్రీహరి, ధర్మానంద్‌గౌడ్, తిరుపతి, శ్రీనివాస్, అహ్మద్, నరేష్ ఉన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

- కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ నెల 29 నుంచి నిర్వహించనున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను సంబంధిత అధికారుల సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో డీసీపీ భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 29 నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు, 29న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ (బ్యాక్‌లాంగ్ స్టూడెంట్లకు మాత్రమే), 30న ఉదయం 10గంటల నుంచిమ ధ్యాహ్నం 1 గంట వరకు పర్యావరణ, 31న ప్రథమ సంవత్సరం, ఫిబ్రవరి1న ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ అంశాల్లో క్వాలి ఫైయింగ్ పరీక్షలు, 3నుంచి 22వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షల నిర్వహణ కోసం మొత్తం 39 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఎంపీసీ, బీపీసీ విద్యార్థులు 3850 మంది, ఒకేషనల్ 1,936 మంది హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

అధికారులు కేటాయించిన విదులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో డీఈవో యాదయ్య, డీపీవో వెంకటేశ్వర్‌రావు, అధికారులు పురుషోత్తం నాయక్, రాజేశ్వరి, రాజేష్, సాయికృష్ణ, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో 'ప్రత్యేక' పాలన 6
- అదనపు కలెక్టర్ దీపక్ తివారికి బాధ్యతలు

పర్యవేక్షణ లోపం.. కొనుగోలుదారులకు శాపం 7
- మార్కెట్ భవనంలో ఇష్టారాజ్యంగా కూరగాయల విక్రయాలు

అడవుల్లో ప్రమాదాల నివారణకు చర్యలు

- జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి భగవాన్‌రెడ్డి



వాచ్ టవర్ వద్ద అడవిని పరిశీలిస్తున్న అధికారులు

జైపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విస్తరించి ఉన్న అడవులు, ప్లాంటేషన్‌లలో అగ్ని ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి (డీఎఫ్‌వో) భగవాన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జైపూర్ అటవీ ప్రాంతంలోని వాచ్‌టవర్ వద్ద అటవీ శాఖ, అగ్నిమాపక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మంచిర్యాల, చెన్నూరు అటవీ డివిజన్‌లు, తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థకు చెందిన సిబ్బందికి అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ శాఖ వారికి తమశాఖ తరుపున పూర్తి సహకారం అందిస్తూ అడవుల రక్షణకు పాటు పడదామన్నారు. అటవీడివిజన్ అధికారి సర్వేశ్వర్ మాట్లాడుతూ అటవీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఇప్పటి నుంచే వేసవి కాలం ముగిసే వరకు అప్రమత్తంగా ఉంటూ అంకిత భావంతో విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారులు రత్నాకర్‌రావు, శివకుమార్, సదానందం, అప్పలకొండ, అనిత, సుభాష్, మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేష్‌కుమార్, ఫైర్ స్టేషన్ అధికారి గణేష్‌బాబు, అటవీ, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.